క్లుప్తంగా

24న బహిరంగ సభ



సోరుసాంబయ్య

బొబ్బిలి: భారతదేశ చరిత్రలో 1932 సెప్టెంబర్ 24 చీకటి రోజని, ఆరోజు జరిగిన పూనా ఒడంబడిక ద్వారా దళితులకు అన్యాయం జరిగిందని అంబేడ్కర్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సోరు సాంబయ్య తెలిపారు.పట్టణంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సెప్టెంబర్ 24న నిరసన దినంగా పాటిస్తూ బొబ్బిలిలో బహిరంగ సభ నిర్వహించనున్నట్టు తెలిపారు. పూనా ఒడంబడికపై రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ జీవితాంతం బాధపడే వారన్నారు. పూనా ఒడంబడిక గురించి ప్రజలకు తెలియజేసేందుకు పట్టణంలో సభ నిర్వహించనున్నాని సాంబయ్య చెప్పారు.

గ్రామాల్లో చెత్త సేకరణ పరిశీలన



సోపేరులో చెత్తసేకరణను పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు

రాజాం: మండలంలోని సోపేరు, కొఠారిపురం, నందబలగ తదితర గ్రామాల్లో క్లాప్ మిత్రలు ఇంటింటి నుంచి చేపడుతున్న చెత్తసేకరణను ఎంపీడీఓ వి. శ్రీనివాసరావు బుధవారం ఉదయం పరిశీలించారు. ఆయా గ్రామాల్లో మహిళలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. చెత్తను ఆరుబయట పారబోయకుండా ఇళ్ల వద్దకు వచ్చే క్లాప్ మిత్రలకు అందజేయాలని సూచించారు. ఎంపీడీఓ వెంట ఆయా పంచాయతీల కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

ప్రత్యేక అవసరాల విద్యార్థులకు ఫిజియోథెరపీ



పిల్లలకు ఫిజియోథెరపీ చేస్తున్న ఫిజియోథెరపిస్ట్ రమాచంద్రిక

రేగిడి: స్థానిక భవిత కేంద్రంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రత్యేక అవసరాల విద్యార్థులు, చిన్నారులకు ఫిజియోథెరపిస్ట్ రమాచంద్రిక బుధవారం ఫిజియోథెరపీ సేవలందించారు. ప్రత్యేక అవసరాల పిల్లలకు ఇళ్ల వద్ద రోజూ తల్లిదండ్రులు ఫిజియోథెరపీ చేసుకునేలా అవగాహన కల్పించారు.రోజూ ఫిజియోథెరపీ చేస్తే కొన్నాళ్లకు అంగవైకల్యం సమసిపోయే అవకాశం ఉందని ఫిజియోథెరపిస్ట్ రమాచంద్రిక వివరించారు. ఎంఈఓ ఎం.వి.ప్రసాదరావు, సహిత విద్య ఉపాధ్యాయులు యు.మహేశ్వరి, టి.రాజేష్, అనూరాధ,తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందికి సత్కారం



సచివాలయ ఉద్యోగులను సత్కరిస్తున్న జెడ్పీటీసీ నర్సింహులు, తదితరులు

రాజాం సిటీ: మండల పరిధి పెనుబాక గ్రామ సచివాలయంలో పనిచేసి ఇటీవల బదిలీ అయిన ఐదుగురు ఉద్యోగులను జెడ్పీటీసీ బండి నర్సింహులు, సర్పంచ్ బండి బోడెమ్మ బుధవారం సత్కరిం చారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సచివాలయ సిబ్బంది గ్రామస్తులకు అందించిన సేవలను కొనియాడారు. ఎక్కడైనా సరే ప్రజామన్ననలు పొందేలా పనిచేయాలని సూచించారు. సక్రమంగా విధులు నిర్వర్తించే ఉద్యోగులకు ఎప్పుడూ గుర్తింపు లభిస్తుందని అన్నారు. గ్రామస్తులు పాల్గొన్నారు.

నేపాల్‌లో మనవారుంటే సమాచారమివ్వండి

బాడంగి: నేపాల్‌లో ప్రస్తుతం పరిస్థితులు బాగోలేవని,అల్లర్లు జరుగుతున్నాయని, మండల వాసులు ఎవరైనా అక్కడ చిక్కుకుంటే తక్షణమే తమకు సమాచారం ఇవ్వాలని తహసీల్దార్ కె.వరప్రసాద్ వీఆర్‌ఓలకు సూచించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో మండలంలోని వీఆర్‌ఓలతో తహసీల్దార్ బుధవారం సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పుణ్య క్షేత్రాలకు, విహార యాత్రలకు వెళ్లిన వారి సమాచారం కూడా ఇవ్వాలన్నారు. భూసమస్యల సత్వరపరిష్కారానికి గురు వారం నుంచి చర్యలు చేపడుతున్నామని చెప్పారు.జాయింట్ ఎల్‌పీఎంలు ఉన్న వారు గ్రామ సచివాలయాల్లోనే వీఆర్‌ఓలకు ఆఫ్‌లైన్‌లో రూ.50 చెల్లించి దరఖాస్తు అందజేయాలన్నారు. వీఆర్‌ఓ లు, సర్వేయర్లు ఉదయం పూట సచివాలయాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ భూముల ఖాతాల స్ప్లిట్టింగ్ కోసం వచ్చే దరఖాస్తులను రికార్డుల్లో నమోదు చేసుకుని, అదే రోజు మధ్యాహ్నం తన కార్యాలయంలో ఆన్‌లైన్ చేసుకోవాలన్నారు. భూముల ఖాతాల స్ప్లిట్టింగ్ విషయంపై గ్రామాల్లో దండోరా వేయించాలని చెప్పారు. ఎంఆర్ఐ జగదాంబ, సర్వేయర్ సతీష్ పాల్గొన్నారు.

నిబంధనలు, నాణ్యతకు తిలోదకాలు..!

- రహదారి విస్తరణలో మార్కింగ్ ప్రకారం నిర్మాణాలను తొలగించని వైనం
- పనుల్లో నాణ్యత, నిబంధనలను పట్టించుకోని అధికారులు



మోర్ షాపింగ్ మాల్ ఎదురుగా ఉన్న దుకాణాల వద్ద కొలతల ప్రకారం కాకుండా ముందుకు నిర్మిస్తున్న కాలువ



దోలపేట దగ్గర ముక్కలైన డివైడర్

రాజాం సిటీ: రాజాం–పాలకొండ ప్రధాన రహదారి విస్తరణ పనుల్లో నాణ్యత, నిబంధనలకు తిలోదకాలు ఇస్తున్నారు. కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా పనుల్లో డొల్లతనం కనబరుస్తున్నా అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రోడ్డు విస్తరణ పనులు వేగంగా జరుగుతున్నప్పటికీ అధికారుల చేతివాటం వల్ల రోడ్డు కొన్ని చోట్ల అవసరం లేని మలుపులు తిరగగా, మరికొన్ని చోట్ల వెడల్పు తగ్గుతోందని, డ్రైనేజీ నిర్మాణం కూడా ఒక్కోచోట ఒకలా చేపడుతున్నారని పట్టణవాసులు విమర్శిస్తున్నారు. తాజాగా నిర్మాణం చేపడుతున్న డివైడర్ గోడలు మూడు రోజులకే ముక్కలు కావడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్, ఆర్‌అండ్‌బీ అధికారు లకు అన్నీ తెలిసినప్పటికీ ఎందుకు మిన్నకుండిపోతున్నారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. రోడ్డు పనుల్లో భాగంగా కాలువలు నిర్మాణం సక్రమంగా జరగడం లేదనేందుకు అంబేడ్కర్ కూడలికి సమీపంలోని మోర్ షాపింగ్ మాల్ ఎదురుగా చేపట్టిన పనులే నిదర్శనం. 80 అడుగుల వెడల్పుతో చేపట్టాల్సిన రోడ్డు నిర్మాణాన్ని ఇక్కడ బాగా కుదించేశారని పట్టణవాసులు ఆరోపిస్తున్నారు. మోర్ ఎదురుగా ఉన్న షాపుల వద్ద డ్రైనేజీ నిమిత్తం మున్సిపల్ ప్లానింగ్ అధికారులు గతంలో ఇచ్చిన కొలతలను కాదని రోడ్డుమీదకు డ్రైనేజీ నిర్మాణం చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు ఇచ్చిన మార్కింగ్ ప్రకారం దుకాణాల గోడలను తొలగించాల్సి ఉంది.కానీ గోడలను తొలగించకుండానే కాలువ నిర్మిస్తుండడంతో అధికారుల తీరుపై పట్టణవాసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కాసులవేటలో అధికారులు, కాంట్రాక్టర్ కలిసి ఇలా వ్యవహరిస్తున్నారని పట్టణవాసులు బాహాటంగానే విమర్శిస్తున్నారు. కాలువ నిర్మాణ విషయాన్ని ఆర్ అండ్‌బీ ఏఈ నాగభూషణరావు వద్ద సాక్షి ప్రస్తావించగా రోడ్డు విస్తరణలో భాగంగా ఇరువైపులా కాలువలు కట్టినంత వరకే తమ బాధ్యతని అన్నారు.కాలువపై గోడలు ఉన్నా కాలువకు ఎలాంటి ఇబ్బందిలేదని అన్నారు. కాలువ కట్టిన తర్వాత కూడా కొంతమంది వాటిపై రేకులు వేసుకుంటున్నారని, వాటితో మాకు సంబంధంలేదు. మున్సిపాలిటీ అధికారులు చూసుకోవాలి. రోడ్డు మధ్యలో డివైడర్లు పాడైనచోట మరమ్మతులు చేయిస్తున్నాం.

చట్టాలపై అవగాహన అవసరం



బొబ్బిలిరూరల్: విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ పీఓ విజయలక్ష్మి

బొబ్బిలిరూరల్: కిశోరబాలికలు చట్టాలు, వారి హక్కులపై అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ పీఓ పి.వరలక్ష్మి అన్నారు. 'మిషన్ శక్తి- మిషన్ వాత్సల్య' కార్యక్రమంలో భాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మండలంలోని నారసింహునిపేట ఉన్నత పాఠశాలలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. బాల్యవివాహాల నిరోధక చట్టం, గుడ్ టచ్, బ్యాడ్‌టచ్, పోక్సో, తదితర చట్టాల గురించి, హెల్ప్‌లైన్ నెంబర్లు, సహాయం పొందే విధానాలను వివరించారు.హెచ్‌ఎం రామారావు, ఉపాధ్యాయులు,ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నేరం

రేగిడి: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఎంపీపీ దార అప్పలనరసమ్మ, ఐసీడీఎస్ బూరాడ సెక్టార్ సూపర్‌వైజర్ నూకాలమ్మ అన్నారు. మండలంలోని ఏ.వి.పురం, ఆమదాలవలస, రేగిడి గ్రామాల్లో కిశోర బాలికలకు బాల్య వివాహాలు, సామాజిక సమస్యలపై బుధవారం అవగాహన కల్పించారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. బాలికలు విధిగా పౌష్టికాహారం తీసుకోవాలని, లేకుంటే భవిష్యత్‌లో ఆరోగ్య సమస్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. సర్పంచ్‌లు చుక్క వెంకటనాయుడు, అప్పయ్య, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

సమస్యలను ఆత్మవిశ్వాసంతో ఎదుర్కోవాలి



మాట్లాడుతున్న జె.సి.రాజు

బొబ్బిలి: ఆత్మహత్య ఆలోచనల నివారణకు ఆత్మవిశ్వాసమే అసలైన మందు అని కారుణ్య సంస్థ చైర్మన్ జె.సి.రాజు అన్నారు. ఆత్మహత్యల నివారణ దినం సందర్భంగా స్థానిక శ్రీ సాయి డిగ్రీ కాలేజ్‌లో విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. ఆత్మ హత్యల నివారణకు సంబంధించిన గోడపత్రికలను ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ వయసు రీత్యా వచ్చే ఆలోచనలను అనుసరించి ఒక్కొక్కరికీ ఒక్కో సమస్య ఎదురవుతుందన్నారు. వాటిని ఆత్మవిశ్వాసంతో పరిష్కరించుకునే మార్గాలు ఎన్నుకోవాలన్నారు. ఏ సమస్యకైనా పరిష్కారం మార్గం ఖచ్చితంగా ఉంటుందనే విషయాన్ని గుర్తెరగాలన్నారు. సమస్య అయినా, స్వీయ తప్పులైనా పరిష్కారానికి ముందు చొరవ చూపితే, ఆ తర్వాత ఆత్మహత్య అనే ఆలోచన నుంచి బయటపడవచ్చన్నారు.కారుణ్య సంస్థ సీఓ డేవిడ్ జె.విక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అప్పలనాయుడు, కళాశాల డైరెక్టర్లు చుక్క రమణ, శైలేంద్ర, కారుణ్య సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ సభ్యత్వ నమోదు



పొగిరి హైస్కూల్‌లో ఉపాధ్యాయులతో ఏపీటీఎఫ్ నేతలు

రాజాం సిటీ: మండలంలో పొగిరి, డోలపేట, బొద్దాం, పెనుబాక తదితర గ్రామాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఏపీటీఎఫ్ యూనియన్ నేతలు సంఘ సభ్యత్వ నమోదు కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఉపాధ్యాయుల సమస్యలపై ఆరాతీసి, వివరాలు సేకరిం చారు. ఆసంఘం శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు మజ్జి మదన్ మోహన్‌తో పాటు సభ్యులు పాల్గొన్నారు.

బొబ్బిలిలో ప్రభుత్వ కళాశాలలు ఏర్పాటు చేయండి

బొబ్బిలి: పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి కె.మణికుమార్, తదితరులు కోరారు.నియోజకవర్గంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యే బేబీ నాయనను బొబ్బిలిలో బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఎస్ఎఫ్ఐ కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ బొబ్బిలి పట్టణానికి చుట్టపక్కల ఉన్న సుమారు ఏడెనిమిది మండలాల విద్యార్థులు ఇంటర్, డిగ్రీ చదువుకునేందుకు వస్తుంటారని వారి కోసం ప్రభుత్వ కాలేజీలు ఏర్పాటు చేయాలన్నారు. సంక్షేమ వసతి గృహాల్లో సౌకర్యాలు కల్పించాలని, సొంత భవనాల నిర్మాణానికి చర్యలు తీసుకోవా లని, పెండింగ్‌లో ఉన్న ఉపకార వేతనాలు వెంటనే విడుదల చేసేలా చూడాలని కోరారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు శివ, కిరణ్, మండల కమిటీ సభ్యులు జానీ, మహేష్, తారక్, గజేంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

కూటమి నేతలకే యూరియా ఇస్తే ఎలా..?



మాట్లాడుతున్న సీపీఐ జిల్లాకార్యవర్గ సభ్యుడు అప్పన్న, తదితరులు

బొబ్బిలి: రైతు సేవా కేంద్రాలు, పీఏసీఎస్‌లకు ప్రభుత్వం అప్పుడప్పుడూ పంపించే కొద్దిపాటి యూరియాను కూటమి నాయకులే తన్నుకు పోతున్నారని, రైతుల పరిస్థితి ఏం కావాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కోట అప్పన్న ప్రశ్నించారు. పట్టణంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడు తూ గత కొద్ది రోజులుగా యూరియా దొరక్క రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, సమస్యను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. యూరియా కొరత లేదని, పంపిస్తున్నామని ప్రభుత్వం చెబుతోందని, మరి ప్రభుత్వం పంపిస్తున్న యూరియా ఏమైపోతోందని ప్రశ్నించా రు. ఏ బ్లాక్ మార్కెట్‌కు తరలిపోతోందని మండిపడ్డారు. వెంటనే ప్రభుత్వం కళ్లు తెరచి రైతులకు సరిపడా యూరియా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళన చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సీపీఐ పట్టణ కార్యదర్శి మునకాల శ్రీనివాస్, వై.బాబ్జీ, తదితరులు పాల్గొన్నారు.

శ్రమదానంతో పూడిక తీత



కాలువలో తుప్పలు, పూడిక తొలగిస్తున్న రైతులు

బాడంగి: అధికారులు వచ్చి ఏదో చేస్తారని ఎదురు చూడకుండా మండలంలోని చినభీమవరం గ్రామానికి చెందిన రైతులు శ్రమదానం చేసి సాగునీటి కాలువను బాగుచేసుకున్నారు. చినభీమవరంలోని బలగవాని చెరువు నుంచి పొలాలకు సాగునీరందించే కాలువలో పూడికలు, తుప్పలను ఆయకట్టు రైతులంతా కలిసి బుధవారం తొలగించారు. కాలువలో తుప్పలు, పూడిక ఉండడం వల్ల పొలాలకు సాగునీరు సక్రమంగా సరఫరా కావడం లేదని, అధికారులు స్పందించకపోవడంతో తామే శ్రమదానం చేసి వాటిని తొలగించామని రైతులు చెప్పారు.

శరన్నవరాత్రి ఉత్సవాలకు ముహూర్తపురాట



రాట వేస్తున్న ఆలయ ధర్మకర్త నర్సింగరావు

రాజాం సిటీ: స్థానిక బస్టాండ్ ఆవరణలోని నవదుర్గ అమ్మవారి ఆలయం వద్ద దసరా శరన్నవరాత్రి ఉత్సవాల నిర్వహణకు బుధవారం ముహూర్తపు రాట వేశారు. ఆలయ ధర్మకర్త వానపల్లి నర్సింగరావుతో అర్చకులు రామాయణం శ్రీనివాసరావుశర్మ ప్రత్యేక పూజలు చేయించిన అనంతరం ఆలయ ఆవరణలో రాట వేశారు. ఈసందర్భంగా ధర్మకర్త మాట్లాడుతూ ఈ నెల 22 నుంచి తొమ్మిది రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించనున్నామని తెలిపారు. ఈనెల 11న దేవీ దీక్షలు ప్రారంభమవుతాయని చెప్పారు. దాసరి అప్పారావు, కూరాడ వెంకటరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

పీహెచ్‌సీ సందర్శన

బొబ్బిలిరూరల్: పిరిడి గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (పీహెచ్‌సీ) ఎమ్మెల్యే బేబీ నాయన బుధవారం సందర్శించారు. పీహెచ్‌సీలో రోగులకు అందిస్తున్న సేవలపై డాక్టర్ రఘువంశీని అడిగి తెలుసుకున్నారు.రోగులతో మాట్లాడి సేవలపై ఆరాతీశారు. పీహెచ్‌సీ పరిధిలో 93 మంది సిబ్బంది పనిచేస్తున్నారని, ప్రతి నెలా సమావేశాలు నిర్వహించేందుకు మీటింగ్ హాల్ నిర్మించాలని డాక్టర్ వంశీ ఎమ్మెల్యేను కోరారు.

12 మందిపై బైండోవర్

రాజాం: మద్యం అక్రమ విక్రయాలనునియంత్రించే చర్యల్లో భాగంగా బెల్టు షాపుల నిర్వహణదారులపై బైండోవర్ కేసులు నమోదుచేస్తున్నామని ప్రొహిబి షన్ అండ్ ఎక్సైజ్ శాఖ రాజాం సీఐ ఆర్.జైభీమ్ తెలిపారు. గతంలో బెల్టు షాపులు నిర్వహిస్తూ పట్టుబడిని రాజాం పరిధిలోని 12 మందిని మండల తహసీల్దార్ కార్యాలయంలో మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ రాజశేఖరం ఎదుట బుధవారం హాజరు పరిచామని చెప్పారు. వీరిపై బీఎన్ఎస్ఎస్ చట్టం–2023లోని 129వ సెక్షన్ ద్వారా బైండోవర్ కేసులు నమోదుచేయడంతో పాటు ఒక్కొక్కరికీ రూ.లక్ష అపరాదరుసుం పూచీకత్తుపై సంవత్సర కాలవ్యవధికి శిక్ష విధించినట్టు వెల్లడించారు. రాజాం సర్కిల్‌లోని వ్యాపారులు మద్యం అక్రమ విక్రయాలు చేస్తే ఇలాంటి కఠిన చర్యలు ఉంటాయని, బెల్టుషాపుల నిర్వహణ విరమించుకోవాలని హెచ్చరించారు.

జాగ్రత్తలతో అగ్ని ప్రమాదాల నివారణ



పెట్రోల్ బంకు సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక శాఖ ఎస్ఐ అశోక్

రాజాం సిటీ: ముందస్తు జాగ్రత్తలు పాటిస్తూ, అప్రమత్తంగా ఉండడం వల్ల అగ్ని ప్రమాదాలను నివారించవచ్చని స్థానిక అగ్నిమాపక శాఖ ఎస్ఐ పి.అశోక్ తెలిపారు. మండలంలోని రాజయ్యపేటవద్ద ఉన్న పెట్రోల్ బంకులో పని చేస్తున్న సిబ్బందికి బుధవారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ అగ్నిప్రమాదాలు సంభవిస్తే ఆందోళన చెందకుండా అవగాహనతో మెలగాలని సూచించారు. ముందుగా సేఫ్టీ పరికరాలను ఉపయోగించి ప్రాథమికంగా మంటలు అదుపుచేసేందుకు ప్రయత్నించాలని చెప్పారు. మంటలను అదుపుచేసే పరికరాలను ఉపయోగించే విధానాన్ని వివరించారు. అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

పార్కింగ్ కష్టాలు



రాజాం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో వాహనదారులు పార్కింగ్ కష్టాలు పడుతున్నారు. సుదూర ప్రాంతాలు ప్రయాణించేవారంతా ఇక్కడకు ఉదయాన్నే తమ ద్విచక్రవాహనాలపై వచ్చి ఇక్కడ వాహనాలను పార్కింగ్ చేసి బస్సుల్లో వెళుతుంటారు. అయితే వాహనాలను భద్రంగా ఉంచేందుకు పార్కింగ్ స్థలంలేక, గత్యంతరం లేక బస్టాండ్ ముందర అస్తవ్యస్తంగా నిలుపుదల చేసి వెళ్లిపోతున్నారు. వర్షాలకు, ఎండలకు ఈ వాహనాలు పాడవుతున్నాయి. మరో వైపు కాంప్లెక్స్‌లోకి వచ్చే ప్రయాణికులు ఈ వాహనాలను తప్పించుకుని వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఇక్కడ వాహన పార్కింగ్ స్థలాన్ని కేటాయించాలని పట్టణవాసులు, ప్రయాణికులు కోరుతున్నారు. – రాజాం

దాత సహకారంతో మరమ్మతులు



రామభద్రపురం–రాజాం రహదారిలో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడడం వల్ల అధ్వానంగా తయారైంది. ఈ మార్గంలో ప్రయాణించే వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్న విషయం, ప్రయాణికుల ఇబ్బందులపై 'ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోరా..?' శీర్షికతో సాక్షిలో ఈనెల 10 వతేదీన కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి బొబ్బిలి సీఐ కె.నారాయ ణరావు, ఎస్ఐ వి.ప్రసాదరావు స్పందించారు. స్టోన్ క్రషర్ యజమాని బొబ్బా శేఖర్ సహకా రంతో పోలీసులు బుధవారం మరమ్మతులు చేయించారు. గుంతల్లో స్టోన్ డస్ట్,మెటల్ వేసి జేసీబీతో చదును చేయించారు.ఈపనులు చేయించాల్సిన ఆర్‌అండ్‌బీ అధికారులు మాత్రం అది తమపని కాదన్నట్టు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని, కనీసం పట్టించుకోవడం లేదని ఆ మార్గంలో ప్రయాణించేవారు, వాహన చోదకులు విమర్శిస్తున్నారు. – రామభద్రపురం

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడి



వరి పంట మంచి దిగుబడి రావాలంటే సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ శాఖ రాజాం ఏడీఏ కె.చంద్రరావు రైతులకు సూచించారు. పొలంపిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రాజాం మండలంలోని గడిముడిదాం గ్రామంలో వరి పంట పొలాలను బుధవారం ఆయన పరిశీలించారు. పంటను ఆశించి చీడపీడలు, వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించాలని, సేంద్రియ, ప్రకృతి వ్యవసాయ విధానాలను పాటించాలని రైతులకు సూచించారు. మండల వ్యవసాయ అధికారి రఘునాథ్, సచివాలయ వీఏఏలు పాల్గొన్నారు. – రాజాం

మాదకద్రవ్యాలతో జీవితాలు నాశనం



మాట్లాడుతున్న సీఐ నారాయణరావు

రామభద్రపురం: మాదక ద్రవ్యాలకు అలవాటు పడితే జీవితాలు నాశనమవుతాయని బొబ్బిలి రూరల్ సీఐ కె.నారాయణరావు అన్నారు. డ్రగ్స్,గంజాయి వినియోగం, ర్యాగింగ్,సైబర్ నేరా ల వల్ల జరుగుతున్న అనర్థాలపై సంకల్పం కార్యక్రమంలో భాగంగా మండలంలోని రొంపల్లి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ విద్యార్థుల దృష్టి అంతా చదువు,ఉద్యోగాల సాధనపై ఉండాలన్నారు.సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన పెంచుకుని తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఇంటర్ పూర్తయ్యే వరకు సెల్ ఫోన్ జోలికి వెళ్లకూడదన్నారు.సెల్‌ఫోన్‌తో కాలక్షేపం చేయకుండా శ్రద్ధగా చదువుకోవాలని చెప్పారు. అలాగే గుడ్ టచ్,బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పిచారు. ఎస్ఐ వి.ప్రసాదరావు పాల్గొన్నారు.

కొనసాగుతున్న యూరియా కష్టాలు



యూరియా కోసం సిరిపురం రైతు సేవా కేంద్రానికి వచ్చిన రైతులు

సంతకవిటి: యూరియా కోసం మండల రైతుల కష్టాలు కొనసాగుతున్నారు. సిరిపురం రైతు సేవా కేంద్రంలో బుధవారం యూరియా పంపిణీ చేస్తామని అధికారులు చెప్పడంతో అక్కడికి రైతులు అధిక సంఖ్యలో చేరుకున్నారు. రైతు సేవా కేంద్రంలో 220 బస్తాల యూరియా మాత్రమే అందుబాటులో ఉండడంతో కూపన్‌ల కోసం రైతులు తోపులాడుకున్నారు. యూరి యా దొరకని రైతులు నిరాశతో వెనుదిరిగారు. సచివాలయ వీఏఏ కిల్లి త్రివేణి మాట్లాడుతూ సచివాలయం పరిధిలో రైతులు 1500 ఎకరాల్లో వరి సాగుచేస్తున్నారని, ఇప్పటి వరకు మూడు దఫాలుగా 862 బస్తాల యూరియా పంపిణీ చేశామని, మరో 440 బస్తాలు అవసరమని తెలిపారు.

మెనూ పాటించకుంటే చర్యలు

తెర్లాం: పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకంలో మెనూ పాటించకుంటే వంట నిర్వాహకులపై చర్యలు తప్పవని ఎంఈఓ జె.త్రినాథరావు అన్నారు. సతివాడ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాలను బుధవారం పరిశీలించారు. వంటకాలను రుచి చూసి, సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థుల హోం వర్క్ పుస్తకాలు, చేతిరాత పుస్తకాలను పరిశీలించారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా బోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు.